సాక్షి రంగారెడ్డి

గురువారం । 5 । అక్టోబర్ । 2023



పేదల నాయకుడు

రెడ్డిపల్లిలో మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డివిజన్ కార్యనిర్వాహక కార్యదర్శి డిమాండ్ చేశారు. 8లో▸



హక్కులు కల్పించండి

నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల సర్వేకు వెళ్లిన అధికారులపై కౌలు రైతులు మండిపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్ గూటికి 'బిగ్ షాట్'

- బీఆర్‌ఎస్‌ను వీడనున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి
- నేడు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో భేటీ
- తాండూరు టికెట్‌పై హామీ



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 'బిగ్ షాట్' కాంగ్రెస్‌లో చేరనున్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి హస్తం కండువా వేసుకోవాలని డిసైడయ్యారు. తాండూరు అసెంబ్లీ టికెట్ ఇస్తామన్న హామీతోనే కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గురువారం వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భేటీ అవుతారని మనోహర్‌రెడ్డి సన్నిహితులు వెల్లడించారు. బ్రేక్ ఫాస్ట్ భేటీలో భాగంగా కాంగ్రెస్ నేతలు మనోహర్‌రెడ్డి నివాసానికి రానున్నారని తెలిపారు. మనోహర్‌రెడ్డి గతంలో రెండు సార్లు కుల్కచర్ల జెడ్పీటీసీగా పనిచేశారు. ఈయన చేరిక పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ప్రభావం చూపనుంది.

ఎన్నికలకు సహకరించండి

అఖిలపక్ష నాయకులతో ఆర్డీఓ



అఖిలపక్ష నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని ఆర్డీఓ అనంతరెడ్డి కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరిగేలా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ తుది ఓటరు జాబితాను విడుదల చేసి రాజకీయ పక్షాల నేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి యశ్వంత్, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొన్నారు.

తలకొండపల్లి ఎస్‌ఐగా శ్రీను



తలకొండపల్లి: తలకొండపల్లి ఎస్‌ఐగా శ్రీను నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రభుత్వ ఆదేశాల మేరకు తలకొండపల్లి ఎస్‌ఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

బుద్ధ విగ్రహం వద్ద కొత్త మనోహర్‌రెడ్డి నిరసన

రేవంత్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్



బుద్ధ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న కేఎంఆర్ అనుచరులు

ఖైరతాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ.. బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి బుధవారం సాయంత్రం ట్యాంక్‌బండ్ బుద్ధ విగ్రహం వద్ద దీక్ష చేశారు. మహేశ్వరం నియోజకవర్గం నాయకులతో వచ్చి ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు న్యాయం జరగాలంటే రేవంత్‌రెడ్డిని పీసీసీ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న నేతలను రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. ఆయన అవినీతిని ప్రశ్నించినందుకే షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వకుండా తనను సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడకు చేరుకున్న లేక్ పోలీసులు మనోహర్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులను అరెస్ట్ చేశారు.

ఓయూ స్నాతకోత్సవానికి అడోబి సీఈఓ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 31న జరగనున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా అమెరికాకు చెందిన అడోబి సీఈఓ శంతన్ నారాయణ్ హాజరు కానున్నట్లు కంట్రోలర్ ప్రొ.రాములు తెలిపారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

నేల చూపులు

రెండేళ్లు జోరుగా సాగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆరు నెలలుగా ఆగిపోయింది. కోవిడ్ సమయంలో తగ్గిన బిజినెస్.. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. ఫార్మాసిటీ, ప్రముఖ కంపెనీల రాకతో జిల్లాలోని వ్యవసాయ భూములకు రెక్కలొచ్చాయి. దీంతో వ్యాపారం మరింత జోరందుకుంటుందని భావించిన స్థిరాస్తి వ్యాపారుల సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

'రియల్' వ్యాపారం కుదేలు

- కోట్లు పెట్టుబడి పెట్టి భూముల కొనుగోలు
- నిలిచిన క్రయవిక్రయాలు
- అప్పులు తీర్చేందుకు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్న వైనం
- భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుని అప్పులు ఇస్తున్న వడ్డీ వ్యాపారులు



యాచారంలో చేసిన ఓ వెంచర్

యాచారం: రంగారెడ్డి– నల్గొండ జిల్లాల సరిహద్దులోని మాల్ మార్కెట్‌కు చెందిన ఓ రియల్ వ్యాపారి తనతో పాటు కొందరు స్నేహితులతో కలిసి రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాలో ఏడాది క్రితం 20 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఆ భూమిని విక్రయించి మంచి లాభాలు ఆర్జించారు. ఆ తర్వాత రూ.రెండున్నర కోట్లు అప్పు తెచ్చి మరో 40 ఎకరాల భూమి తీసుకున్నారు. అయితే ఆరు నెలలుగా భూముల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. కొనుగోలు చేసిన ధరకు అమ్ముదామనుకున్నా కొనేవారే కరువయ్యారు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి రెండింతలయ్యాయి. దీంతో మాల్‌లో కొనుగోలు చేసిన 10 ఎకరాల భూమిని వడ్డీ వ్యాపారులకు రిజిస్ట్రేషన్ చేసి.. 40 ఎకరాలు కొనుగోలు చేసేందుకు తెచ్చిన అప్పు తీర్చాడు.

ఆఫర్లు ప్రకటించినా..

ఆరు నెలలుగా భూముల క్రయ, విక్రయాలు పూర్తిగా స్తంభించడంతో రియల్ వ్యాపారులు కుదేలవుతున్నారు. జిల్లాలో ఫార్మాసిటీ, ఇతర ప్రముఖ కంపెనీలు తరలివస్తుండడంతో రెండేళ్లుగా యాచారం, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మాడ్గుల, షాద్‌నగర్, చేవెళ్ల, మంచాల తదితర మండలాల్లో భూముల వ్యాపారం జోరుగా సాగింది. ఆయా మండలాల్లో దాదాపు రూ.2,500 కోట్లకు పైగా రియల్ వ్యాపారులు పెట్టుబడులు పెట్టి వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేశారు. ఒక్కసారిగా నిలిచిన క్రయవిక్రయాలతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కుప్పలుగా పెరిగి ఆందోళన చెందుతున్నారు. ప్లాట్లు కొన్న వారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ, 30 శాతం కమీషన్ ఇస్తామని భారీ ఆఫర్లు ప్రకటించినా స్పందన కరువైంది. పలువురు రియల్ నిపుణులు వచ్చే ఏడాది మే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు నెలల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత మేలో ఏపీ అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయ్యే వరకు రియల్ వ్యాపారం ముందుకు సాగే అవకాశం కనిపించడం లేదు.

వడ్డీ వ్యాపారులు అప్రమత్తం

ఇన్నాళ్లు నమ్మకంగా వడ్డీలిచ్చిన అడ్తీ వ్యాపారులు అప్రమత్తమయ్యారు. నమ్మకంతో లక్షలాది రూపాయలు అప్పులు ఇచ్చేవారు. మాట పోతుందనే భయంతో తీసుకున్న వారు సైతం అంతే నమ్మకంగా తిరిగి చెల్లించేవారు. కానీ రియల్ వ్యాపారం పుణ్యమా అని నమ్మకమనే మాటకు విలువే లేకుండా పోయింది. దీంతో వడ్డీ వ్యాపారులు తమ రూటును మార్చేశారు. భూములు, ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని మార్కెట్ విలువకు సగం డబ్బులు మాత్రమే అప్పుగా ఇస్తున్నారు. తీసుకున్న అప్పుతో సహా వడ్డీ కలిపి ఏడాది లోపు తిరిగి ఇవ్వకపోతే రిజిస్ట్రేషన్ చెల్లుబాటు అవుతుందని ఒప్పంద పత్రాలు రాయించుకుంటున్నారు. పైన తెలిపిన మండలాల్లో ఈ తరహా రిజిస్ట్రేషన్లు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. రంగారెడ్డి– నల్గొండ జిల్లాల సరిహద్దు ప్రాంతం మాల్ మార్కెట్లో నిత్యం రూ.10 నుంచి రూ.20 కోట్లకు పైగా వడ్డీ వ్యాపారం కొనసాగుతోంది.

నిలిచిన రూ.2 వేల కోట్ల రియల్ వ్యాపారం

జిల్లా పరిధిలోని ఆయా మండలాల్లో రూ.2 వేల కోట్లకు పైగా వ్యాపారం నిలిచిపోయింది. ఆర్థికంగా ఉన్న వ్యాపారులు వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకుని ధర వచ్చినప్పుడే అమ్ముదామనే భరోసాతో ఉండగా.. అప్పులు తెచ్చి కొనుగోలు చేసిన వ్యాపారులు సమస్యల్లో కూరుకున్నారు. వ్యాపారాలు నిలిచిపోవడంతో దాదాపు మూడు వేలకు పైగా మంది దళారులు(మధ్యవర్తులు) జీవనోపాధి కోల్పోయారు. భూముల క్రయవిక్రయాలతో మంచి కమీషన్లు పొందిన మధ్యవర్తులు విలాసాలకు దూరమయ్యారు. కొనుగోలు చేసిన కార్లకు ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

కొనేవారే లేరు



ఆరు నెలలుగా క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేశాం. విక్రయాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం. కొనుగోలు చేసిన ధర కంటే తక్కువకు అమ్ముదామన్నా కొనేవారే లేరు. ఏం చేయాలో తోచడం లేదు.

– జిట్టు శ్రీశైలం,
రియల్ ఎస్టేట్ వ్యాపారి, హైదరాబాద్

మాటిచ్చా.. చెక్కులతో వచ్చా

- ఈ రోజు చాలా సంతోషంగా ఉంది
- ఎమ్మెల్యే మంచిరెడ్డి భావోద్వేగం
- మైనింగ్ జోన్ బాధితులకు పరిహారం అందజేత
- మిగిలిన వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ

అబ్దుల్లాపూర్‌మెట్: 'నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఈ సమస్య పరిష్కారం కోసం పడినన్ని ఇబ్బందులు ఎప్పుడూ పడలేదు. మీకు వాగ్దానం చేసిన నాటి నుంచి ప్రతి రోజు మనసులో ఇదే మెదిలేది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి ప్రతీసారి ఈ విషయంపై చర్చించేవాడిని. నేనంటే గిట్టని వారు అపహాస్యం చేసినా భరించా. నా తల్లి పెద్దకర్మ రోజున సీఎం కేసీఆర్ పరామర్శకు వచ్చినా కూడా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని విన్నవించా. ప్రభుత్వం నుంచి పరిహారం చెక్కులు తీసుకున్న రోజే మీ గ్రామంలో (బండరావిరాల, చిన్నరావిరాల) అడుగు పెడతానని ఇచ్చిన మాటకు కట్టుబడి.. చెక్కులతో మీ ముందుకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాల వల్ల 20 ఏళ్లుగా మీరు పడుతున్న బాధలకు నావంతుగా సాయం చేసినందుకు గర్వంగా ఉంది' అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాలలో మైనింగ్ జోన్ (సర్వేనంబర్ 268)లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నరావిరాల గ్రామంలోని గువ్వలేటిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బండరావిరాల మైనింగ్ జోన్ సర్వేనంబర్ 268లో భూములు కోల్పోయిన 209 మంది రైతులు 400 రోజులకు పైగా శాంతియుత ధర్నా చేయడం తనను ఎంతగానో కలచి వేసిందన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ బాధితులందరికీ న్యాయం చేయాలనే తపన ఉన్నా.. గత ప్రభుత్వాలు, గతంలో పనిచేసిన అధికారులు చేసిన నిర్లక్ష్యంతో 50 మందికి మాత్రమే నేడు పరిహారం అందించగలుగుతున్నామని తెలిపారు. మిగిలిన 159 మందికి 293 సర్వేనంబర్‌లో ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించి అందరికీ న్యాయం చేస్తామన్నారు. 268 సర్వేనంబర్‌లో వడ్డెర కులస్తులకు 60 ఎకరాల భూమిని కేటాయించనున్నట్లు ప్రకటించారు. యాభై మంది రైతులకు రూ.9.90కోట్ల విలువైన పరిహారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌దత్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బాటసింగారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వనజాశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ అనితా మహేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, కుత్బుల్లాపూర్, బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల్లో చేపట్టిన పలు పనులు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు కిరణ్‌కుమార్‌గౌడ్, స్వరూపాయాదవ్, ఎంపీటీసీలు సౌమ్య, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



మైనింగ్ జోన్ భూ నిర్వాసితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇంద్రారెడ్డి ఆశయసాధనకు కృషి

- మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: దివంగత హోంమంత్రి ఇంద్రారెడ్డి ఆశయసాధనకు కృషి చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డిజయంతి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి సమాధికి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి నివాళులర్పించారు. చేవెళ్ల, ఖానాపూర్ స్టేజి, కౌకుంట్ల స్టేజీ వద్ద ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ టైగర్ ఇంద్రారెడ్డి తుదిశ్వాస వరకు ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధిలో ఆయన కృషి మరువలేనిదన్నారు.ఈ కార్యక్రమంలోఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింలు, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, శేఖర్, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంద్రారెడ్డి సమాధికి నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, కాలె యాదయ్య తదితరులు

మహిళలకు బతుకమ్మ కానుక

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

మొయినాబాద్: సీఎం కేసీఆర్ మహిళలకు బతుకమ్మ చీరలను కానుకగా అందజేస్తున్నారని రాష్ట్ర మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో బుధవారం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వితంతు మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు, స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు బతుకమ్మ చీరల ఇవ్వడంతో పాటు నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ నక్షత్రం, వైస్ ఎంపీపీ మమత, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, జెడ్పీటీసీ మాజీ అనంతరెడ్డి, సీనియర్ నేతలు నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి,ఎంపీడీఓ సంధ్య, సర్పంచ్‌లు వినీత, స్వరూప, నరోత్తంరెడ్డి, కుమార్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, అంజయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, మాజీ వైస్ చైర్మన్ రాజు, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, జయవంత్, తిరుపతి రెడ్డి, ఆంద్రూ, ఈశ్వర్, రాంరెడ్డి పాల్గొన్నారు.



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

అధికారుల తీరుపై విమర్శలు

బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. రెడ్డిపల్లిలో బుధవారం ఇంద్రారెడ్డి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభావేదికపైనే బతుకమ్మ చీరలు, పింఛన్ మంజూరు పత్రాలు పంపిణీ చేయడాన్ని తప్పుపడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను అధికారుల పార్టీ వేదికల్లో చేపట్టడం సరికాదన్నారు.

రోడ్డుపైనే సభా వేదిక

రెడ్డిపల్లిలో ఇంద్రారెడ్డి విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభావేదికను రోడ్డుపైనే ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డును పూర్తిగా మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. అధికార పార్టీ నేతలు రోడ్డుపైనే సభావేదిక ఏర్పాటు చేస్తే అనుమతి ఎలా ఇచ్చారని ఇతర పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

- జిల్లా వ్యాప్తంగా 33,56,056 మంది ఓటర్లు



తుర్కయంజాల్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ఎన్నికల కమిషన్ బుధవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 33,56,056 ఓటర్లుండగా.. వీరిలో పురుషులు 17,38,994 మంది, మహిళలు 16,15,876 మంది, 404 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లలో పురుషులు 153, మహిళలు 39 మంది, సర్వీస్ ఓటర్లలో పురుషులు 568 మంది, మహిళలు 22 మంది ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ స్టేషన్లు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్ల సంఖ్య
ఇబ్రహీంపట్నం	319
ఎల్‌బీనగర్‌లో	570
మహేశ్వరం	511
రాజేంద్రనగర్	535
శేరిలింగంపల్లి	622
చేవేళ్ల	298
కల్వకుర్తి	262
షాద్‌నగర్	252
మొత్తం	3,369

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం సంఖ్య, పేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	మొత్తం
48-ఇబ్రహీంపట్నం	1,57,804	1,52,923	29	3,10,756
49-ఎల్‌బీ నగర్	2,96,073	2,70,702	101	5,66,876
50-మహేశ్వరం	2,66,749	2,50,560	67	5,17,376
51-రాజేంద్రనగర్	2,88,422	2,64,074	39	5,52,535
52-శేరిలింగంపల్లి	3,70,365	3,27,647	142	6,98,154
53-చేవెళ్ల	1,28,850	1,25,196	4	2,54,050
83-కల్వకుర్తి	1,17,527	1,13,251	7	2,30,785,
84-షాద్ నగర్	1,13,925	1,11,584	15	2,25,524
మొత్తం ఓటర్లు	17,39,715	16,15,937	404	33,56,056

నేడు మెగా డెయిరీ ప్రారంభం

- పాడి రైతులకు చేయూత.. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

తుక్కుగూడ: జిల్లాలో మరో ప్రాజెక్టు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. మహేశ్వరం మండలంలోని శ్రీశైలం జాతీయ రహదారి వెంట రావిర్యాలలో ప్రభుత్వ పాల ఉత్పత్తుల సేకరణ సంస్థ విజయ డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. పాడి రైతులకు చేయూత, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, డెయిరీ అభివృద్ధి లక్ష్యంగా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) సాంకేతిక సహకారంతో ఈ మెగా డెయిరీని ఏర్పాటు చేశారు.

డెయిరీ లక్ష్యాలు

ప్రస్తుతం నగరంలోని మౌలాలిలో కొనసాగుతున్న విజయ డెయిరీని రావిర్యాలలో ఏర్పాటు చేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా విశాలమైన ప్రదేశంలో ఈ యూనిట్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో 2021 సెప్టెంబర్ 3న మంత్రులు సబితారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో రావిర్యాలలో 32 ఎకరాల విస్తీర్ణంలో, రూ.246 కోట్ల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం విజయ డెయిరీ ద్వారా నిత్యం రైతుల నుంచి నాలుగు లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. రెండేళ్లలో రైతులను మరింత ప్రోత్సహించి ఎనిమిది లక్షల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా ఈ డెయిరీ ఏర్పాటుకు సంకల్పించారు.



ప్రారంభానికి సిద్ధమైన రావిర్యాల విజయ డెయిరీ

పాడి పశువుల కొనుగోలుకు రూ.10వేల సబ్సిడీ

ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన రైతులు విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షలకు పైగా మంది రైతులు ఇందులో సభ్యులుగా కొనసాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా విజయ డెయిరీ ప్రస్తుతం సుమారు లక్ష లీటర్ల పాలు సేకరిస్తోంది. ఈ డెయిరీ పాల ప్యాకెట్లు, నెయ్యి, పెరుగు, బటర్‌మిల్క్, లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, ఐస్‌క్రీం ఇలా 28 రకాల వస్తువులను తయారు చేసి విక్రయించాలని నిర్ణయించారు. రోజుకు లక్షల లీటర్ల సామర్థ్యం గల టెట్రా ప్యాక్, 5 వేల లీటర్ల పాలతో ఐస్‌క్రీం తయారీకి ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఈ డెయిరీలో 30 టన్నుల వెన్న, 10 టన్నుల నెయ్యిను తయారు చేసే సామర్థ్యం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 2వేల అవుట్ లెట్లు, ఆరు వందల పార్లర్లున్నాయి. రైతులు పాల ఉత్పత్తులను పెంచేందుకు పాడి పశువుల కొనుగోలుకు రైతులకు రూ.10 వేలు సబ్సిడీ ఇస్తోంది.

ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

ఈ మెగా డెయిరీని నేడు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పి.సబితారెడ్డితో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, తెలంగాణ పాడి పరిశ్రమ కార్పొరేషన్ చైర్మన్, అధికారులు, డెయిరీ అధికారులు, తదితరులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు.

సమస్యలు పరిష్కరించండి



షాద్‌నగర్: నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల నిరసన

షాద్‌నగర్: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం డివిజన్ కార్యనిర్వాహక కార్యదర్శి జమీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్ డివిజన్ తపాలా ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. జమీల్ మాట్లాడుతూ.. కమలేష్ చంద్ర కమిటీ నివేదికను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నివేదికను ప్రభుత్వం అమలు చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. గ్రామీ ప్రాంతాల్లో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ వివిధ రకాల తపాల సేవలతో పాటుగా ఆసరా పెన్షన్ డబ్బులు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు డబ్బులు అందజేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తమను కేవలం ఐదు గంటలు మాత్రమే పనిచేస్తున్న ఉద్యోగులుగా గుర్తిస్తూ తీరని అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు అంజయ్యగౌడ్, మొగులోజీ, ఇర్ఫాన్‌బేగం, అలివేలు, చంద్రమౌళి, పృథ్వీరెడ్డి, కేశవులు, అమర్‌నాథ్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించండి..

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖలో పనిచేస్తున్న జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ఆమనగల్లు పోస్టాఫీసు ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. తపాలా ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. పెన్షన్, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రవీందర్, అధ్యక్షుడు హరినాద్‌రావ్, ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు విష్ణుమూర్తి, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల నాయకుడు ఇంద్రారెడ్డి



మొయినాబాద్: ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి



ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

- ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి
- మంత్రి సబితారెడ్డి

మొయినాబాద్: పేద ప్రజలకు అండగా నిలిచి.. ఎంతో మందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన దివంగత నేత ఇంద్రారెడ్డి.. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన సతీమణి, మంత్రి సబితారెడ్డి అన్నారు. రెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఎంపీటీసీ శ్రీనివాస్ ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి, సీనియర్ నేతలు నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పలువురి నివాళి..

మొయినాబాద్ మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, దారెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. చిలుకూరులో ఇంద్రారెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రత్నం నివాళులర్పించారు. సర్పంచ్ స్వరూప, ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీసర్పంచ్ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

శభాష్ వెంకటేశ్..

శంకర్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే వన్‌గా సాగుతోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో రూ.1.80 కోట్లతో నిర్మించిన ఆడిటోరియం, దాతల సాయంతో మోకిలలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని బుధవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. జనవాడ గ్రామంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గౌడిచర్ల వెంకటేశ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గడిచిన ఏడాది కాలంలో ఆడ పిల్లలకు జన్మనిచ్చిన 64 మంది తల్లులకు.. మంత్రి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.16 వేల చొప్పున వెంకటేశ్ సొంత డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, సర్పంచ్‌లు రవిందర్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, సుమిత్ర, నీలమ్మ, ఎంపీటీసీలు సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగేందర్, సరిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, రాజునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

నేడు షాద్‌నగర్‌కు మంత్రి కేటీఆర్ రాక

షాద్‌నగర్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ గురువారం షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఉదయం 10:30గంటలకు నందిగామ మండల పరిధిలోని చాకలిదాని గుట్ట తండాకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న తర్వాత తండాలోని నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, అనంతరం కొత్తూరులోని మున్సిపల్ కార్యాలయం భవనం, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించనున్నారు. అనంతరం షాద్‌నగర్ పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం, గిరిజన భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగించనున్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ప్రముఖ నాయకులు హాజరుకానున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

'డీటీఎఫ్' సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: డీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16, 17వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో జరుగు శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

పుట్టిన రోజే.. చివరి రోజైంది

- ఒకే బైక్‌పై ఐదుమంది ప్రయాణం
- అదుపుతప్పి యువకుడి దుర్మరణం
- మొయినాబాద్ మండలం తోలుకట్ట సమీపంలో ప్రమాదం



రాఘవేంద్ర (ఫైల్)

మొయినాబాద్: పుట్టిన రోజే ఓ యువకుడికి చివరి రోజయ్యింది. స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు ఒకే బైక్‌పై ఐదు మంది వస్తుండగా బైక్ అదుపుతప్పి అతడు మృతి చెందాడు. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ ఏపీ రంగా తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రంలోని యాద్గిర్ జిల్లా చెంద్రి గ్రామానికి చెందిన మొండేని రాఘవేంద్ర(18).. పుట్టినరోజు(బుధవారం) వేడుకలు మొయినాబాద్‌లో నిర్వహిస్తామని అతడి స్నేహితులు శ్రీనివాస్, వీరేశ్ పిలవడంతో.. రాఘవేంద్ర మరో ఇద్దరు స్నేహితులు తిమ్మప్ప, నగేష్‌తో కలిసి మంగళవారం అర్ధరాత్రి బస్సులో బయలుదేరారు. మొయినాబాద్‌లోని స్నేహితులు శ్రీనివాస్, వీరేష్.. రాఘవేంద్రకు ఫోన్ చేసి పరిగిలో బస్సు దిగితే మేము పికప్ చేసుకుంటామని చెప్పారు. దీంతో రాఘవేంద్ర, తిమ్మప్ప, నగేష్ పరిగిలో బస్సు దిగారు. శ్రీనివాస్, వీరేశ్ బైక్‌పై పరిగి వెళ్లి వారిని పికప్ చేసుకున్నారు. ఐదుమంది కలిసి ఒకే బైక్‌పై అక్కడి నుంచి మొయినాబాద్‌కు బయలుదేరారు. బుధవారం తెల్లవారుఝామున 3 గంటల సమయంలో మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట గేటు సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ఐదుమందికీ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మొయినాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అందులో రాఘవేంద్ర పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న..

- ఇద్దరు మైనర్ల అరెస్టు
- జువెనైల్ హోమ్‌కు తరలింపు

ఇబ్రహీంపట్నం: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు గత కొన్నేళ్లుగా మంగల్‌పల్లి, వనస్థలిపురం, హయత్‌నగర్, సైదాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్ చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు బుధవారం వారిని అరెస్టు చేసి విచారించగా.. ఇప్పటివరకు 4 బైక్‌లను చోరీ చేసినట్లు వెల్లడించారు. వాహనాలను స్వాధీనం చేసుకోని.. మైనర్ బాలురలను జువెనైల్ హోమ్‌కు తరలించారు. గతంలో హయత్‌నగర్, వనస్థలిపురం పీఎస్‌లలో వీరిద్దరిపై కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ పథకం ఇక్కడి నుంచేనా!



రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న పనులు

- ఈనెల 6న తుక్కుగూడకు సీఎం కేసీఆర్ రాక
- రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తారంటూ సమాచారం

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉదయం పూట అల్పాహార పథకాన్ని అందుబాటులోకి తేబోతోంది. ఈ పథకాన్ని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 6న ప్రారంభించనున్నట్లు సమాచారం. దీంతో పాఠశాలలో రెండు రోజుల నుంచి విద్యా, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దడం, భవనాలకు రంగులు వేయడం, పాత భవనాలను కూలిృవేయడం, మౌలిక వసతుల కల్పన వంటివి చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చే రహదారులకు మరమ్మతులు చేస్తున్నారు. రెండు రోజుల నుంచి రావిర్యాలలో అధికారులు, రాజకీయ నాయకుల పర్యటనలతో హడావిడి నెలకొంది. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ రావిర్యాల గ్రామానికి మొదటిసారి వచ్చే ఆవకాశం ఉండటంతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కూడా జన సమీకరణలో నిమ్మగమయ్యారు.

రోడ్డు దాటుతుండగా..

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



సాంబరాజు మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు దాటుతున్నక్రమంలో బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదిబట్ల ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట్‌కు చెందిన సాంబరాజు తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజు చెత్త ఏరుకొని జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం రాత్రి బ్రాహ్మణపల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్న బైక్ అతడ్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సాంబరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం: సబితారెడ్డి

చేవెళ్ల: రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలో డీసీఎంఎస్ కమర్షియల్ భవనం,గోదాం నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అదే విధంగా మహిళలకు బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పల్లె ప్రగతితో గ్రామాలు స్వచ్ఛతకు నిలయాలుగా మారాయన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు సమకూర్చామని..నర్సరీలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుల కోసం రూ.535.44 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో 2,601 రైతువేదికలు నిర్మించామన్నారు. ఎంపీరంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, గోదాం మేనేజర్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మార్కెట్‌కమిటీ చైర్మన్ రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహులు, మండల అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ఖైరతాబాద్: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్యాంమనోహర్ మాట్లాడుతూ జేఎల్‌ఎం నుంచి సీజీఎం వరకు అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్‌లకు ఏపీఎస్ ఈబీ రూల్స్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేడి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.చంద్రయ్య, కుమారస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు

అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై షాహినాయత్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్ ప్రాంతంలో రాణి అవంతిబాయి విగ్రహం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా దిమ్మె కడుతున్నందుకు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... 2019వ సంవత్సరంలో కూడా ఎమ్మెల్యే రాజాసింగ్, అతని అనుచరులు ఎలాంటి అనుమతులు లేకుండా రాణి అవంతిబాయి విగ్రహాన్ని పెట్టడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. తిరిగి మంగళవారం ఎమ్మెల్యే రాజాసింగ్ అనుచరులు ఎలాంటి నుమతులు తీసుకోకుండా కట్టడం నిర్మించడంతో ఎస్.ఐ.లక్ష్మయ్య విధుల్లో భాగంగా చూసి ఫిర్యాదు చేశారని, దీంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సున్నితమైన ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగే విధంగా కట్టడం నిర్మిస్తున్నందునే కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ పోలీసుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు అడుగుల దిమ్మె కడితే పోలీసులకు ఏమి నష్టమని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో ప్రజలకు ఎవ్వరికీ ఇబ్బందులు లేవని, బీఆర్‌ఎస్ నాయకుల ఒత్తిడితోనే తనపై పోలీసులు కేసులు నమోదు చేశారని రాజాసింగ్ పేర్కొన్నారు.

సర్వేకాదు.. హక్కులు కల్పించండి

- ఓంకారేశ్వరాలయ భూముల సర్వేకు వచ్చిన అధికారులపై కౌలు రైతుల ఆగ్రహం
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జోక్యంతో వెనుదిరిగిన అధికారులు



నస్దిక్‌సింగారంలో భూ సర్వేకు వెళ్లిన అధికారులతో కౌలు రైతుల వాగ్వాదం

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల సర్వేకు వెళ్లిన అధికారులపై కౌలు రైతులు మండిపడ్డారు. తమకు సమాచారం లేకుండానే బుధవారం ఆలయ భూముల సర్వేకు ఎలా వస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందివనపర్తి ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాల భూముల్లో వందేళ్ల క్రితం నుంచి నందివనపర్తి, తాడిపర్తి, కుర్మిద్ద, నస్దిక్‌సింగారం గ్రామాలకు చెందిన 400లకు పైగా కుటుంబాలకు చెందిన కౌలు రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కౌలు రైతులు ప్రతి యేటా కౌలు చెల్లిస్తూ రాళ్ల, రప్పలు, గుట్టలున్న భూమిని రూ.లక్షలు ఖర్చు చేసి సాగుకు యోగ్యంగా మార్చుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఆలయానికి చెందిన సర్వే నంబరు 11 నుంచి 515 వరకు ఉన్న నంబర్లల్లోని 1,400 ఎకరాల భూమిని తాజాగా టీఎస్‌ఐఐసీ సేకరించేందుకు నిర్ణయించింది. విషయం తెలుసుకున్న కౌలు రైతులు ఏళ్లుగా ఆలయ భూముల్లో కౌలు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం.. కౌలు చెల్లిస్తున్నాం .. హక్కులు కల్పించి ఆ భూములపై పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాల ఆలయ భూమి కబ్జాకు గురైందని, సర్వే చేసి హద్దులు గుర్తించాలని మాజీ ఆలయ ధర్మకర్త కృష్ణమూర్తి దేవాదాయ, ధర్మాదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. కౌలు రైతులు రెండేళ్లుగా కౌలు చెల్లించకపోగా ఆ భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తుండటంతో రెవెన్యూ అధికారులు ఇన్నాళ్ల రెవెన్యూ రికార్డుల్లో పహాణీలో నమోదు అవుతున్న కౌలు రైతుల పేర్లను తొలగించారు.

స్వాధీనం కోసం సర్వే..

ఓంకారేశ్వరాలయ ఆలయానికి చెందిన భూమిని టీఎస్‌ఐఐసీకి అప్పగించేందుకు అధికార యంత్రాంగం చూస్తోంది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు సర్వే పేరుతో అధికారులు వస్తున్నారు. వారం క్రితం నస్దిక్‌సింగారం గ్రామంలో ఆలయ భూముల సర్వేకు వెళ్లగా తాడిపర్తి సర్పంచ్ దూస రమేశ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కౌలు రైతులు అడ్డుకున్నారు. అధికారులపై తిరగబడ్డారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. బుధవారం మరోమారు నస్దిక్‌సింగారం గ్రామంలోని ఆలయ భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించేందుకు అధికారులు వచ్చారు. విషయం క్షణాల్లోనే తెలుసుకున్న వందలాది మంది కౌలు రైతులు అధికారులపై తిరగబడ్డారు. మా భూములు ఉన్నాయా, సర్వే కాదు, ముందు ఆ భూములపై హక్కులు కల్పించి, పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వండి అంటు మండిపడ్డారు. అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, ప్రతిఘటించడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అధికారులపై దాడికి యత్నించారు. తాడిపర్తి సర్పంచ్ రమేష్ విషయాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేరవేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వే పేరిట కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. దీంతో అధికారులు సర్వేను నిలిపేసి వెళ్లిపోయారు. కలెక్టర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో కౌలు రైతులు శాంతించారు.